


"ఫిఫ్టీవన్, ప్లీజ్!"

ఆ నంబరు టోకెన్ అందిస్తున్న యువకుని ఆ క్షణం రెప్పార్పకుండా చూసింది, గ్లాసుకౌంటరు వెనక కూర్చున్న మాలిని.

పాతిక ఏళ్ళు ఉంటాయేమో—చామనచాయతో, ఆరోగ్యంతో మిసమిసలాడుతున్న ముఖం, ముఖ్యంగా చూడగానే ఆకట్టుకునే పొడుగాటి నాసిక, వత్తయిన జుత్తు, కళ్ళకు రెబాన్ గ్లాసెస్ భుజం మీద ఉన్న ఆప్రాన్, కుడిచేతి వేళ్ళమధ్య కదలాడే స్టెత్ చూశాక పక్కనే ఉన్న మెడికల్ కాలేజీ గుర్తుకు వచ్చింది.

అతడూ అలాగే చూశాడామెను. మరీ అప్సరస కాకపోయినా, ప్రతి మగవాడూ రెండవసారి చూడ గలిగిన రూపమే.

తను అందించిన డబ్బును పర్స్‌లో పెట్టుకుంటూ వెళ్ళబోతూన్న అతను ఓరగా మళ్ళీ చూశాడేమో అనిపించింది మాలినికి. ఆ తరవాత పనిలో లీనమయినాక ఆ విషయాన్ని పూర్తిగా మరిచిపోయింది, మరునాటి దినం మళ్ళీ అతడు వచ్చేదాకా.

"ఫైవ్ థౌజండ్స్!" క్రెడిట్ వోచరుతో బాటు డబ్బు అందిస్తూ చెప్పాడు.

డబ్బు అందుకుంటున్న మాలినికి ఎందుకో గుండె దడదడ లాడింది. తను దాదాపు ఆరు నెలలుగా ఆ కౌంటరులో పని చేస్తుంది.

## కొమ్మిడి మత్స్యేంద్రరెడ్డి

ఎన్నో రకాల కస్టమర్సును చూసింది. అయినా ప్రత్యేకంగా ఇదేమిటి? ఆలోచిస్తూంటే లెక్క తప్పడంతో తత్తరపాటుగా తల ఎత్తింది.

తదేకంగా గమనిస్తున్న అతను.

ఆ క్షణం ఇద్దరూ చూపులు తిప్పుకోలేక పోయారు.

ఆమె మనః స్థితిని వూహించినట్లుగా అతడు మందహాసం చేశాడు.

కంగారుగా తల దించుకుని మళ్ళీ నోట్లు లెక్కించడం ప్రారంభించింది.

కాష్‌బుక్‌లో ఎంటర్ చేసుకున్నాక రసీదు ఇస్తుంటే మాత్రం—"మే ఐ నో యువర్ నేమ్, ప్లీజ్?" అని అతి మెల్లగా ఆమెకు మాత్రమే వినిపించేటట్లు అడిగాడు.

అసలే విశాలమయిన మాలిని కళ్ళు మరింతగా విప్పారినాయి. "మాలిని ... మిస్ మాలిని!" అప్రయత్నంగా అంది.

చిరునవ్వు నవ్వాడతడు. "థాంక్యూ... థాంక్యూ వెరీ మచ్. నా పేరయితే మీకు తెలుసను కుంటాను?" అంటూనే కదిలిపోయాడు.

వూహించని ఆ పరిణామానికి పూర్తిగా ఉక్కిరిబిక్కిరి అయిన మాలిని అనుకోకుండానే కాష్‌బుక్‌లోకి చూసింది. అవును—అతడు కార్తీక్! బాల్ పెన్ను వెంపకు ఆనించుకుని ఆ అక్షరాల వేపు చూస్తూ ఉండిపోయింది.

ఒక నెల రోజుల్లో మూడు మార్లు డబ్బు క్రెడిట్ చేసి, రెండుమార్లు విత్‌డ్రా చేశాడు కార్తీక్. ప్రతిసారీ థౌజండ్స్—ఆస్థిపరుడు కాబోలనుకుంది. ఆ నెల రోజుల పలకరింపులతో పరిచయం కాస్త పెరిగిందనే చెప్పాలి.

తనకు తెలియకుండానే అతడి గురించి ఆలోచించడం పరిపాటి అయిపోయింది. మాలినికి. రోజూ బాంక్‌కు వచ్చేటప్పుడు కట్టుకోవలసిన చీరను ఎన్నుకోవడం మరీ కష్టమయిపోయింది. అలంకరణ పట్ల శ్రద్ధ పెరిగింది. ఆమెలోని మార్పును, తను కనపించగానే ఆ కనుపాపల్లో కదిలే మెరుపును ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నాడు కార్తీక్ కూడా.

ఆ తరవాత అతడి జాడ లేదు. కౌంటరు వద్దకు ఎవరు వచ్చినా, అతడేనేమోనన్న భ్రమతో ఆత్రతగా చూసేది మాలిని. నిరాశతో నిట్టూర్పులు విడిచేది కస్టమర్సును కసురుకునేది.

పది రోజుల తరవాత లంచ్‌లో కాఫీకని బయటికి రాగానే చిరునవ్వుతో కనిపించాడు కార్తీక్. ముందేదో అగాధమున్నట్లు టక్కున ఆగిపోయింది మాలిని.

"బాగున్నారా?" తళతళ మెరుస్తున్న తెల్లని కారును ఆనుకుని, స్టెత్‌ను విలాసంగా కదిలిస్తూ అడిగాడు.

పెదవి విప్పలేక మంత్ర ముగ్ధలా తల ఆడించింది.

"అదేమిటి— మాట్లాడరు? నా పలకరింపు అంత విస్మయాన్ని కలిగించిందా?"

"అహా. అదేం లేదు. చాలాకాలం తరవాత

అనుకోకుండా కనిపించే సరికి..." మాటలను సగం లోనే ఆపేసి, ఎందుకన్నానా అనుకుంది.

వింతగా నవ్వాడు ఆమెను చూస్తూ కార్తీక్. "అర్జెంటుగా పూరికి వెళ్ళవలసి వచ్చింది. వెళ్ళే ముందు చెప్పాలనే అనుకున్నాను కాని, మన పరి చయమెంతని... ఆ లంచ్ అవరూ కదూ? అలా వెళ్ళి కాఫీ తీసుకుందాం!" కారు డోరు తెరిచి చొరవగా అన్నాడు.

ఒక్క క్షణం గుండె గుబగుబ లాడినా, కారు ఎక్కింది మాలిని.

అనాడు రాత్రి ఏవో ఆలోచనలూ, మరేవో మధురానుభూతులతో నిద్ర పట్టక సతమతమై పోతూంటే మాత్రం తెలుసుకుంది మాలిని— కార్తీక్‌ను ప్రేమిస్తున్నాని.

రెండురోజుల తరవాత మళ్ళీ లంచ్‌లో ప్రత్యక్ష మయ్యాడు — "హలో, మాలినిగారూ!" అంటూ.

"ఏమిటీ, రెండు రోజులుగా దర్శనం లేదు?" చేతులు జోడిస్తూ, చిరునవ్వుతో అంది.

"నా కోసం ఎదురు చూస్తుంటారని ఏ మాత్రం తెలిసినా వచ్చేవాడినే మరి!" మందంగా అన్న ఆ మాటలకు స్నిగ్ధంగా నవ్వింది మాలిని.

"పదండి కాఫీకి వెళదాం!" అంటూ ఆమె అంగీకారం కోసం ఎదురు చూడకుండా స్టీరింగు ముందు కూర్చున్నాడు కార్తీక్.

నిస్సంకోచంగా కారు ఎక్కింది మాలిని.

"ఏమయినా టిఫిన్?" కూర్చున్నాక మెనూ చూస్తూ అడిగాడు.

"మీ ఇష్టం!" అల్లరిగా ముందుకు వాలుతున్న అతడి గుంగురు వెంట్రుకలనే తదేకంగా గమనిస్తున్న మాలిని పరధ్యానంగా అంది.

"ఒ. కె. దెన్! టు శాండ్‌విచెస్!" ఆర్డరు చేశాడు కార్డును పక్కన పెడుతూ.

"మీ స్నేహానికి నిజంగానే నేను తగనేమో?" చెంపలను అరచేతుల్లో పెట్టుకుని ముందుకు వంగి కూర్చున్న మాలిని తటాలున అంది.

ఉలిక్కి పడ్డాడా మాటలకు కార్తీక్ — "అదేమిటి?" అంటూ.

శబ్దం కాకుండా నవ్వింది మాలిని. "మీరు ఐశ్వర్యవంతులు. కాబోయే డాక్టరు. మరి నేను — నన్ను గమనించారా? ఇద్దరు చెల్లెళ్ళూ, తమ్ముడూ, రోగిష్టి తల్లీ—వీరందరినీ పోషించడానికని జీవిస్తున్న ఒక మామూలు గుమాస్తాను. మీ స్నేహానికి ఎలా అర్హురాలినో చెప్పండి?!" అతడి కళ్ళ లోకి నిశ్చలంగా చూస్తూ అంది.

ఆ మాటలు విన్నాక అతడి కళ్ళలో ఏమయినా నీలినీడలు కదిలాయేమో కాని, అడ్డంగా ఉన్న అద్దాల మాటున కనిపించలేదు.

"అదేమిటి! స్నేహానికి అంతస్తుల బేధం ఉండదు."

అతడి మాటలు పూర్తి కాక ముందే బేరరు రావడంతో ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

కాఫీ తాగుతున్నప్పుడు మాత్రం తెగిపోయిన ఆ సంభాషణను మళ్ళీ అతికించింది మాలిని. "స్నేహానికి అంతస్తుల తేడా ఉండదు. ఉండ కూడదు. కాని, మన సమాజం ఇంకా ఆ సత్యాన్ని

FREE ! ఉచితం!!

## ముత్యాల సరాలు

# పాపిని మార్చిన రక్తం

అవి రష్యా దేశమునకు, ఫిన్లెండుకు యుద్ధము జరుగుతున్న గడ్డు రోజులు. యుద్ధం చేసేటప్పుడు ఇరువైపుల వారు కొన్ని నియమాలు పాటించటం సహజం. యుద్ధంలో క్షతగాత్రులైన వారు, రోగులు చికిత్స పొందుచున్న వైద్యశాలల మీద బాంబులు వేయటం చట్ట విరుద్ధం. అది వైద్యశాల అని గుర్తించుటకు ప్రతి వైద్యశాల మీద ఎర్రని రంగుతో పెద్ద శిలువను చిత్రించేవారు. (Red Cross) ఫిన్నిష్ రెడ్‌క్రాస్ వైద్యశాల మీద పడిన బాంబు వలన చికిత్స పొందుచున్న క్షతగాత్రులు అనేకమంది మరణించారు. విడువక కురుస్తున్న మంచువలన ఎర్రని శిలువ కప్పబడినందున సోవియెట్ విమానంలో నున్నవారు అది వైద్య శాల అని గుర్తించలేదని, అందుచేత ఈ ఘోరం జరిగిపోయిందని వారు జవాబు చెప్పారు. ఇలా వారు సమర్థించుకొన్నప్పుడు ఎవరు మాత్రం ఏమని బదులు చెప్పగలరు? ఇంక ఏమియు చెప్పలేక పూరుకొన్నారు.

ఈ ఎర్రని శిలువ వృత్తాంతం వినినప్పుడు మరియొక శిలువ కూడా గుర్తుకి వస్తుంది. అదేమనగా రక్తముతో తడుపబడిన 'కలువరి శిలువ'. "వారు కలువరి ( కపాలము ) అనబడిన స్థలమునకు వచ్చినపుడు— —అక్కడ ఆయనను శిలువ వేసిరి" అని బైబిలులో వ్రాయబడి యున్నది. అంతర్జాతీయ నియమము ప్రకారము ఎర్రని శిలువ చెక్కిన పై కప్పు కింద నున్న క్షతగాత్రులు బాంబుల దాడి నుండి సురక్షితంగా నివసిస్తూ వుంటారు. అయితే యుద్ధంలో తగిలే గాయాల కన్నా భయంకరమైన గాయాలు పాపక్రియల వలన మనకు కలుగుతూ వుంటాయి. ఈ పాపమనే గాయాలతో బాధపడే ప్రతి రోగీ ప్రభువు రక్తంతో తడుపబడిన శిలువ నీడలో సురక్షితంగా ఆశ్రయం పొందగలడు.

రక్తం చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. ఇది పాత నిబంధన కాలపు పద్ధతి. అందువలననే మేకలను, కోళ్ళను, కోడె దూడలను పాత నిబంధన కాలంలో దేవునికి బలిగా యిస్తూ వుండేవారు. అయితే యేసుక్రీస్తు సర్వమానవ కోటి పాపములను తన దేహంలో భరిస్తూ, ఒక్కసారే మానవుల అపరాధ పరిహారార్థ బలిగా శిలువ మ్రాను మీద మరణించి, తన దివ్య రక్తము చిందించి, మన పాపములకు ప్రాయశ్చిత్తము కలిగించాడు. పశ్చాత్తాపముతో ఈ బలియాగము విశ్వసించిన వారంతా పవిత్రులయ్యారు. "నేను రక్తమును చూచి మిమ్మును నశింప చేయక దాటి పోవుదును"ని పాత నిబంధనలో వ్రాయబడి యున్నది. దిక్కు లేని వారిని దైవకుమారులుగా మార్చే రక్తం, దేవునికి దూరస్థులైన వారిని పవిత్ర పరచి దేవునితో సమాధానపరచిన రక్తం, తిరుగుబాటుదారులకు, తిట్టుబోతులకు పరలోక వారసత్వం అనుగ్రహించిన రక్తమును పాపరహితుడు దైవ కుమారుడైన యేసుక్రీస్తు శిలువమ్రాను మీద చిందించాడు. ఆ యేసుక్రీస్తు గురించి తెలుసుకున్నారా!

—చదలవాడ చంద్రమతీదేవి

ఉచితం !! ఉచితం !!!

దైవస్వరూపుడు, కరుణామయుడగు యేసుక్రీసు జీవిత చరిత్ర, ఆయన కమనీయ బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా పొందదలచుకుంటే మీ చిరునామా మాకు వెంటనే తెల్పండి. పోను ఖర్చులు మేమే భరించి ఉచితంగా మీకు పుస్తకం పంపుతాము. ఈ రోజే వ్రాయండి.

ఫార్ కార్నర్స్,
పోస్టు బాక్సు నెం. 35,
ఖైరతాబాద్,
హైదరాబాద్-4.

FAR CORNERS.

GOSPEL MESSAGE INSERTED BY FAR CORNERS.

గ్రహించే స్థితికి ఎదగలేదు. స్త్రీ పురుషులమధ్య స్వచ్ఛమైన స్నేహమున్నా లోకమేమనుకుంటుందో మీకు తెలియంది కాదు." అతడి ముఖ కవళికలు జాగ్రత్తగా గమనిస్తూ అంది.

"లోకమెప్పుడూ అనుకుంటుంది. సమాజమెప్పుడూ ఆక్షేపణనే చేసుకుంటుంది. దాన్ని మనం లెక్క చేయవలసిన అవసరం లేదు, మాలినీ! ఇంకో సిక్స్ మంత్స్‌లో నా కోర్సు పూర్తి అవుతుంది. అప్పటిదాకా మన స్నేహం ఇలాగే ఉండాలి." ఆవేశంగా అంటూ ఆమె అర చేతిని నొక్కాడు.

ఒక్క క్షణం బిత్తరపోయినా, అంతలోనే తమాయించుకుని మృదువుగా చేయిని వెనక్కు తీసుకుంది మాలిని. "మీరు గొప్పవాళ్ళు, కార్తీక్! ఈ సంఘం మీరు పెంచుకున్న కుక్కపిల్ల కన్న ఎక్కువగా మీకు విధేయతగా ఉంటుంది. మీరు చెప్పినట్లల్లా వింటుంది. కాని, నేను — నేను అతి సామాన్యమైన ఆడపిల్లను! నలుగురి నాలుకలపై నాలుగు మార్లు నానితే నా జీవితమే కాదు, పూర్తిగా మా కుటుంబమే నాశనమైపోతుంది."

"మాలినీ! ఏమిటీ నీవంటున్నది. ఇన్ఫిరో జాం


# దేనా బ్యాంకులో మీడబ్బుని కాలంఎలా తెలుసుకుంటే మారుస్తుందో ఆశ్చర్యపడతారికే-



**సమృద్ధి డిపాజిట్ పథకం**

మీరు పొదుపుచేసేవరి అమోఘమైన వేగంతో పెరుగుతుంది, ఎందుకంటే మీ అసలుతో బాటే మీ వడ్డీకూడా వడ్డీని ఆర్జించి పెడుతుంది గనక. రు. 100 విభాగాల్లో 12 మంచి 120 నెలల కాలపరిమితిలో పెట్టుబడి పెట్టండి.

**రికరింగ్ డిపాజిట్ స్కీమ్**

(పునరావృత్తి డిపాజిట్ పథకం) నెలవారీగా పొదుపు చేసే సొమ్మును భవిష్యత్తులో పెద్ద ఎత్తులో పెట్టుబడిగా మార్చుకోండి. మీరు ఎంత పొదుపు చెయ్యాలను కున్నారో ఎంచుకోండి. రు. 5 మంచి రు. 500 దాకా. కాలపరిమితిని ఎంచుకోండి. 12 మంచి 120 నెలలు.

**ఫిక్సడ్ డిపాజిట్లు**

మీరు వీలుగా పక్కన వెయ్యగల సొమ్ముకు అమోఘమైన లాభాలు. ఎక్కువ కాలపరిమితిలో మీ డబ్బును డిపాజిట్ చేసి మరింత ఎక్కువ వడ్డీని ఆర్జించండి.

**క్యాష్ సర్టిఫికేట్లు**

దానంతట అదే పెరిగిపోయే భద్రతగల పెట్టుబడి. ఈ సర్టిఫికేట్లు రు. 25, రు. 100, రు. 1,000, రు. 10,000, 50,000 మరియు రు. 1,00,000 ల విభాగాల్లో దొరుకుతాయి.

వివరాలకోసం మీకు దగ్గరలోనున్న దేనా బ్యాంక్ శాఖను సందర్శించండి.

**దేనా బ్యాంక్**
(జాతీయం చేయబడిన బ్యాంక్)
కేంద్ర కార్యాలయం : మేకర్ టవర్స్ ఈ, కఫ్ పెరేడ్, బొంబాయి 400 005.

ప్రజల ప్రగతి, సౌభాగ్యంకోసం అంకితమైనది.

RATAN BATRA/DB/TEL/212

పరిచయంలో న న్నింతేనా అర్థం చేసుకున్నది? ఈ చదువు పూర్తి కాగానే శాశ్వతంగా నిన్ను నా దాన్నిగా చేసుకుంటాను. అప్పటి దాకా మన మిలాగే కలిసి ఉండాలి." ఈ మారు మరింత ఉద్రేకపడుతూ అన్నాడు.

అతడి ఆవేశాన్ని చూస్తున్న మాలిని కళ్ళలోనూ ఒక మెరుపు మెరిసింది. ఉద్విగ్నతతో కన్నీరు సుడులు తిరిగింది.

ఆ తరవాత ఆరు నెలల వ్యవధిలో ఎన్నో మార్లు అతడితో షికార్లకు వెళ్ళింది మాలిని. మరెన్నో మార్లు సినిమాలకు వెళ్ళింది. క్షణక్షణానికి అతడి పట్ల, జీవితం పట్ల ఎనలేని ప్రేమా పెంచుకుంటే ఆమధురభావనలఒరవడిగుండెల్లో బరువెక్కి పైపైకి పొంగుకు వస్తూంటే "ఐ లవ్ యూ, కార్తీక్! ఐ లవ్యూ!" అంటూ అదే పనిగా గునగునలాడుతుంది.

ఆ నాడు సాయంత్రం తిన్నగా బాంకుకు వచ్చాడు కార్తీక్.

"చాలా హుషారుగా ఉన్నా రెందుకో?" కారులో కూర్చున్నాక చిలిపిగా అంది మాలిని.

"ఇవ్వాళతో మా పరీక్షలు పూర్తి అయ్యాయి, డార్లింగ్! ఇక రేపో, ఎల్లుండో తనరికి తాళి కట్టేస్తాను. అందుకే ఈ ఉత్సాహం!" కారు పోనిస్తూ చెప్పాడు.

ఆ మాటలు వింటూనే పట్టరాని సంతోషంతో "రియల్లీ?!" అంటూ అతడి భుజంపై వాలి తన్మయత్వంతో కళ్ళు మూసుకుంది మాలిని.

బంజారాహిల్స్‌లోని బంగళా ముందు కారు ఆగినాక "ఇదే మన అంతఃపురం పద!" అంటూ దిగాడు.

ధనవంతుల బంగళా ఎలా ఉంటుందో అలాగే ఉందది.

తన భవనం చూస్తూనే ఆశ్చర్యంతో తలమునక లవుతుం దనుకున్న కార్తీక్, ఆమె నిర్లిప్తతను చూసి కాస్త చిన్నబోయాడు. అయినా, బయటికి కనిపించ నీయకుండా నడుముపై చేయివేసి దగ్గరగా లాక్కున్నాడు.

"నా చదువయిపోయింది. ఇక మన పెళ్ళి ప్రయత్నం చేయాలి, కార్తీక్!" గుండెల్లో ఒదిగి పోతూ మందస్వరంతో చెప్పింది మాలిని.

"డెఫినెట్లీ, డార్లింగ్! రేపే మా నాన్నగారికి ట్రంక్ కాల్ చేసి చెప్పేస్తాను. ఈ నెలలోనే మన పెళ్ళి. ఓ. కే.?"

"మరి కార్తీక్! మీరింత ధనవంతులు. నాలాంటి పేదపిల్ల కోడలుగా రావడానికి మీ నాన్నగారు ఒప్పుకుంటారో, లేదో?" బెదిరిన లేడిలా కళ్ళను వ్రకాల్లా తిప్పుతూ సందేహంగా అంది.

ఆ మాటలకు హాలు దద్దరిల్లేలా నవ్వాడు కార్తీక్. "ఆ భయం మక్కర్లేదు, డియర్! ఈ ఇంట్లో నే నెంత చెపితే అంత. నా మాటే వేదం. డబ్బు దేముంది? మా నాన్న లక్షల ఆస్తికి నే నొక్కడినే వారసుణ్ణి. మన పెళ్ళికి ఏ ఆటంకమూ ఉండదు. బిలీవ్ మీ!" అంటూనే ఆమె పెదాల పైకి వంగ బోయాడు.

కాని, నుదుటిపై వేళ్ళానించి వెనక్కి తోసింది మాలిని. "ఇందుకోసం ఇంకా కొన్నాళ్ళు వోపిక పట్టాలి" అంటూ.



ఆ మాటలకు అతడిలోని అహం దెబ్బతింది. "నన్ను నమ్మలేవా?" చిన్నబోతూ అన్నాడు.

"నమ్మకపోయినట్లయితే ఈ ఆరు నెలలూ నీతో ఇంతగా తిరిగేదాన్నా? కానీ, కార్తీక్! ప్రతిదానికీ కొన్ని హద్దులు ఉండాలి. మన స్నేహానికి కూడా ఇదే హద్దు. పెళ్ళయినాక ఎలాగూ పూర్తిగా నీ స్వంత మేగా?" ముడుచుకుపోయిన అతడి ముఖాన్ని దోసిలి లోకి తీసుకుని, నుదురుపై సుతారంగా పెదా లానించి లేచింది, "ఇక వెళతానంటూ."

* * * *

"చూడమ్మా! రాచరికాలు రద్దయినా మనం రాజవంశీకులం! అది మన రక్తంలోనే ఉంది. కోట్ల కొద్ది ఆస్తికి ఒక్కగా నొక్క వారసురాలివి. నా కాళ్ళపై నేను నిలబడా లంటూ ఉద్యోగంలో చేరావు. నే నందుకు కాదనలేదు. కాని, ఇది పెళ్ళి విషయం. నూరేళ్ళ జీవితం. నా మాట విను." గంభీరంగా చెప్పుకుపోతున్న రాజభూపతి మాటలను మధ్యలోనే అందుకుంది మాలిని.

"అవును, నాన్నగారూ, ఇది నా పెళ్ళి విషయం. జీవితాంతం ఉండిపోయే పవిత్ర బంధం. అందుకే నండీ నా జీవిత భాగస్వామిని నేనే ఎన్నుకున్నాను. ఆస్తి విషయంలో అతడు మనకేమాత్రం తూగక పోవచ్చు. కాని, మంచి మనసుంది. మల్లె పూవు లాంటి సంస్కార ముంది. అన్నింటికన్న ఎక్కువగా నన్ను ప్రేమించే హృదయ ముంది. అతడితోనే నా జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్నాను." దృఢంగా చెప్పింది.

గంటసేపటి నుండి ఎన్నో విధాలుగా చెప్పిచూసిన రాజభూపతి విసిగిపోయాడు. "నీవు చదువుకున్నా వేమో కానీ, లోకజ్ఞానం లేదు, మాలినీ! అమాయకు రాలివి. అతడు నిన్ను కాక నీ ఆస్తిని ప్రేమిస్తున్నా డేమో?"

ఆ మాటలు వింటూనే తృప్తిగా నవ్వింది మాలిని. "మీ కా సందేహం అవసరం లేదు, నాన్నగారూ! నేను మీ కూతురి నని అతడికి తెలియదు. పైగా, ఆగర్భ దరిద్రురాలుగా పరిచయమయ్యాను. న న్నా స్థితిలోనే ప్రేమించా రాయన. ఇప్పటిదాకా అతడికి నేను చెప్పనేలేదు."

"అలాగా!" ఇక అంతకన్న ఎక్కువగా మాట్లాడ లేక పోయా రాయన కూడా.

"అవునండీ. ఈ రోజే అతడిని మీ వద్దకు తీసుకు వస్తాను. ఇక రేపు రాబోయే వారికి — వద్దని కబురు చేయండి" అంటూ తన గదిలోకి వెళ్ళి పోయింది.

ఆ రాత్రి భోజనాల వద్ద ప్రాత్రం మవునంగా, ముభావంగా ఉన్న కూతుర్ని పరీక్షగా చూశాడు రాజభూపతి.

'ఏమిటమ్మా అబ్బాయిని తీసుకువస్తా నన్నావు?

"లేదు, నాన్నగారూ, నేను వోడిపోయాను. మీరు చెప్పిన వ్యక్తిని చేసుకోవడానికి నేను సిద్ధమే. రేపు వాళ్ళను రమ్మనండి." ఉబికి వస్తున్న కన్నీటిని అతడు చూడకూడ దన్నట్లుగా తల ఎత్తకుండానే చెప్పింది.

"అదేమిటమ్మా! ఏమన్నా డతను?"

"ఎవరో కోటీశ్వరుల సంబంధం వాళ్ళ నాన్నగారు నిశ్చయించారట. ఫారిన్ పంపించి పెద్ద చదువులు చెప్పిస్తారట. డబ్బూ, హోదా లేని జీవితం వ్యర్థమని, ఆదర్శాలు జీవితమే కాదని ఆలస్యంగా తెలుసుకున్నా డట." కన్నీటి బొట్లు కంచంలో రాలుతూంటే అక్కడ ఉండలేక పారిపోతున్న ఆమెవేపు జాలిగా చూశాడు రాజభూపతి.

* * *

మరునాడు రాజభూపతి రాజభవనమంతా హడా విడిగా ఉంది. పెళ్ళివారు వచ్చారు.

మెమ్మదిగా కళ్ళెత్తి చూసిన మాలిని త్రుళ్ళి పడింది. అది కలో, నిజమో తెల్చుకోలేక పోయింది. అలాగే ప్రతిమలా చూస్తూండిపోయింది.

కార్తీక్ స్థితి కూడా అలాగే ఉంది. 'ఇదేమిటి! ఎక్కడో మారుమూల సందులో, ఏ పెంకుటిం ట్లోనో ఉండవలసిన మాలిని ఇక్కడ—ఆదీ పెళ్ళి కూతురు స్థానంలో నమ్మనేలేకపోయాడు.'

తేరుకునేసరికి మాయమయింది మాలిని.

"ఈ పెళ్ళి నా కిష్టం లేదు." ఖచ్చితంగా చెప్పింది మాలిని, ఆ తరవాత.

"ఎందుకమ్మా? అతడికేం లోటని? ఒప్పు కుంటా నన్నావు!" విసిగాడు రాజభూపతి.

"అవును, నాన్నగారూ! ఎవరైనా సరే ఒప్పు కుందా మనుకున్నాను. కాని కానీ, అతడినే, నాన్న గారూ, నేను ప్రేమించింది. ఆరాధించింది. నన్ను ఆరు నెలలుగా ప్రేమించి, చివరికి నే నొక దరిద్రురాలినని నిరాకరించింది ఆ వ్యక్తేనండీ! డబ్బుకు అమ్ముడు పోయే అంగడి సరుకు లంటే నాకు విపరీతమైన అసహ్యం. దయచేసి వారిని వచ్చిన దారినే వెళ్ళమనండి." ముఖం తిప్పుకుని వెళుతున్న కూతురు వంక అభిమానంగా చూస్తూ బయటికి నడిచాడు రాజభూపతి. *

